క్లుప్తంగా

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

యాదవ సంఘం కార్యవర్గ ఎన్నిక


యాదవ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో యాదవ సంఘం గిద్దలూరు మండల నూతన కార్యవర్గ సమావేశం యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా నంద్యాల ఈశ్వరయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా బొంతా శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడుగా ముత్యాల యల్లయ్యయాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు జంగాల బాలయ్యయాదవ్, యాదవ సంఘం నాయకులు ఓ.వెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ కె.సురేష్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. మద్యం తాగుతూ వాహనాలు నడుపుతున్న పది మంది పై కేసులు నమోదు చేశారు.

నీటి శుద్ధి కేంద్రానికి శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని ముండ్లపాడు రోడ్డులో రూ.10 కోట్ల నిధులతో మురుగు నీటి శుద్ధి కేంద్రానికి ఆదివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీ అభివృద్ధికి ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు మధుసూదనరావు, ఏఈ రవీంద్ర, సీనియర్ అసిస్టెంట్ టపావలి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కష్టాలు

- ఎండీయూ ఆపరేటర్ల ఖాళీతో ఇక్కట్లు
- పోస్టుల భర్తీలో కూటమి ప్రభుత్వం అలసత్వం
- రేషన్ దుకాణాల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి
- గత ప్రభుత్వంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే రేషన్


బేస్తవారిపేట తహసీల్దార్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఎండీయూ వాహనం

బేస్తవారిపేట: రేషన్ సరుకుల పంపిణీపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో మళ్లీ పాత రోజులు వచ్చే సమయం దగ్గర పడింది. నిత్యావసర సరుకుల కోసం పని మానుకుని గంటలు, రోజుల తరబడి వేచి చూసే పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికే చాలా గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహన సేవలు అందడం లేదు. వారంతా రేషన్ డిపో వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. వాహన డ్రైవర్లు మానేసిన చోట కొత్తవారిని ప్రభుత్వం నియమించకపోవడమే దీనికి కారణం. గతంలో నడవలేని వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, మంచాలపై ఉన్నవారు రేషన్ సరుకుల కోసం దుకాణాలకు వెళ్లలేకపోయేవారు. సరుకులు తెచ్చుకునేవారుకాదు. పేదలందరికీ రేషన్ సరుకులు అందాలన్న ఉద్దేశంతో పాటు స్థానిక యువతకు ఉపాధి చూపాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహన సేవలను అందుబాటులోకి తెచ్చింది. పల్లెలు, పట్టణాల్లో వీధి వీధీ తిరుగుతూ లబ్ధిదారులకు సరుకులు అందించేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటి ముందుకే వాహనం రావడంతో వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు సైతం సులభంగా రేషన్ సరుకులు తీసుకునేవారు. ఇప్పుడు ఈ సేవలపై నిర్లక్ష్యం అలుముకుంది. వాహన సేవలు క్రమక్రమంగా దూరమవుతున్నాయి.

నిలిచిన 14 ఎండీయూ వాహనాలు

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 202 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 53 ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేశారు. ఎండీయూ వాహనాలు మరమ్మతులు, ఆపరేటర్ల రాజీనామాలతో 14 ఎండీయూ ఆపరేటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో లబ్ధిదారులకు రేషన్ కష్టాలు తప్పడం లేదు.

ఒక్కో ఎండీయూ వాహనం పరిధిలో రెండు-మూడు పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలకు రేషన్ షాపు లేకపోవడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. డీలర్ సరుకులు ఎప్పుడిస్తారో వినియోగదారులకు సరైన సమాచారం కూడా ఉండటం లేదు. పనులు మానుకుని రోజుల తరబడి రేషన్ కోసం తిరగాల్సి వస్తోందని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడే లబ్ధిదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు.

మండలం	ఎండీయూ వాహనాలు	మరమ్మతులు/ రాజీనామా
బేస్తవారిపేట	10	04
రాచర్ల	06	03
అర్ధవీడు	07	04
కొమరోలు	07	01
గిద్దలూరు	15	02
కంభం	08	0

వీడని బర్డ్‌ఫ్లూ భయం..!


గొట్లగట్టులో వెలవెలబోతున్న చికెన్ దుకాణం


చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

- కొనుగోలుదారులు లేక పడిపోయిన వ్యాపారం
- అయోమయంలో చికెన్ సెంటర్ల దుకాణదారులు

కొనకనమిట్ల: ఇటీవల పొరుగు జిల్లాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి చనిపోవడంతో ప్రజల్లో మొదలైన భయం నేటికీ వీడలేదు. పొరుగు జిల్లాల్లో రెడ్ జోన్ ఎత్తేసినప్పటికీ చికెన్ కొనేందుకు వినియోగదారులు ముందుకు రావడంతో వ్యాపారం భారీగా పడిపోయింది. బర్డ్ ఫ్లూ ఉన్న జిల్లాల నుంచి కోళ్ల దిగుమతిని పూర్తిగా నిలిపేసిన అధికారులు పరిస్థితులు చక్కబడ్డాక రెడ్ జోన్‌ను కూడా ఎత్తేశారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని, అలాంటి భయం అవసరం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా.. ప్రజలు మాత్రం చికెన్ కొనేందుకు జంకుతుండటం గమనార్హం. తరచూ చికెన్ కొనేవారు సైతం దుకాణల దరిదాపులకే రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల, చినారికట్ల జంక్షన్లలో, అలాగే నాగంపల్లి, వెంగళలపల్లి, నాయుడుపేట, మునగపాడు గ్రామాల్లో చికెన్ దుకాణాలు ఆదివారం వెలవెలబోయాయి. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో చికెన్ విక్రయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం మటన్, చేపల దుకాణాలు జనంతో కళకళలాడాయి. చికెన్ విక్రయాలు పడిపోవడంతో మటన్, చేపల ధరల పెంచారని మాంసప్రియులు చెబుతున్నారు. ధర తగ్గించినప్పటికీ వినియోగదారులు రాకపోతుండటంతో.. అధికారులు చొరవచూపి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని వేడుకుంటున్నారు.

తాగునీటి ఎద్దడి తీవ్రం


కాలనీలో ఒట్టిపోయిన సింగిల్ ఫేజ్ మోటారు


ప్రభుత్వ పాఠశాలలో బిందెలతో నీరు పట్టుకుంటున్న కాలనీ ప్రజలు

- ఆకవీడు ఎస్సీ కాలనీ వాసులకు నీటి కష్టాలు
- నెల రోజులకుపైగా సమస్య వేధిస్తున్నా పత్తా లేని అధికారులు

రాచర్ల: భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడంతో సింగిల్ ఫేజ్ మోటార్లు ఒట్టిపోతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించినా ప్రజల దాహార్తి తీరడం లేదు. దీంతో రాత్రీపగలు తేడా లేకుండా నీటి కోసం జనం జాగరం చేయాల్సి వస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆకవీడు గ్రామంలోని ఎస్సీ కాలనీ(కిందిపాలెం వాసులు నెల రోజులకు పైగా తాగునీటి కోసం అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో 40 నివాస గృహాలున్నాయి. కాలనీలోని సింగిల్ ఫేజ్ మోటరుకు భూగర్భ జలాలు అందకపోవడంతో స్థానిక ప్రజలు బిందెలు పట్టుకుని కాలనీ పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలోని మోటారు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. పాఠశాల మూతపడిన సమయంలో బిందెలు తీసుకుని గ్రామంలో వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. నెల రోజులుగా తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదని ఎస్సీ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బిందె నీటి కోసం కష్టాలు పడుతున్నాం



ఎస్సీ కాలనీలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటారుకు నీరు అందడం లేదు. కేవలం ఒక బిందె నీరు వచ్చి ఆగిపోతున్నాయి. తాగునీటి కోసం బిందెలు తీసుకుని కాలనీ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి తెచ్చుకుని కాలం గడుపుతున్నాం. పాఠశాల మూతపడిన సమయంలో బిందెలు తీసుకుని కిలోమీటరు దూరం నడిచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– బుజ్జమ్మ, ఎస్సీ కాలనీ, ఆకవీడు

సమాజ మార్గదర్శకులు పాత్రికేయులు

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి


నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: సమాజానికి మార్గదర్శకులు పాత్రికేయులని మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పశ్చిమ ప్రకాశం తొలితరం పాత్రికేయుడు ఓరుగంటి రమణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంకె మాట్లాడుతూ.. పాత్రికేయులు సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పాత్రికేయ వృత్తి పవిత్రమైందని, ఓవీ రమణయ్య పాత్రికేయులకు ఆదర్శమని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు, ఓవీ రమణయ్య కుమారుడు ఓవీ మల్లిక్ మాట్లాడుతూ.. పాత్రికేయులు వృత్తి విలువలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, దొనకొండ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. సీనియర్ పాత్రికేయులు కేవీ సత్యనారాయణ, ఎం.అల్లూరెడ్డితోపాటు పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఓవీ రమణయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం


ఎస్సీ బాలికల వసతి గృహంలో మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూష

- పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష

పొదిలి రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో చట్టం, బాలల హక్కుల గురించి న్యాయమూర్తి వివరించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. కోర్టులో కేసులపై కొట్లాడలేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

మహిళల సంక్షేమం, రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు రూపొందించిందన్నారు. గ్రామాల్లో అధిక శాతం భూముల విషయాల్లో అవగాహన లేక ఎంతో మంది కోర్టులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వికసిత్ భారత్ సదస్సులో లా కాలేజీ విద్యార్థుల ప్రతిభ


ప్రశంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

మార్కాపురం: కర్నాటక రాష్ట్రంలోని బళ్లారిలో విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ జాతీయ సదస్సులో మార్కాపురం ఎస్ఎస్ లా కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కోనయ్య తెలిపారు. న్యాయ కళాశాల విద్యార్థులు సిహెచ్ శ్రీనివాసరెడ్డి, జి.సుందర శ్రీరామ్, హసన్, ఖాశీంసా, దివ్య, వెంకటస్వాములు వికసిత్ భారత్ సదస్సులో పాల్గొని పేపర్ ప్రెజెంటేషన్ ఇవ్వడంతో ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలు అందుకున్నారని వివరించారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.


కోనేరు చుట్టూ పెరిగిన చెట్లు

అధ్వానంగా శ్రీవారి పుష్కరిణి

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ సమీపంలోని శ్రీవారి పుష్కరిణి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. కోనేరులో నీరు ఉన్నప్పటికీ చుట్టూ చెట్లు పెరిగిపోవటంతో భక్తులు వెళ్లే మార్గం మూసుకుపోయింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు రోజున స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించడం ఆనవాయితీ. అలాంటి పుష్కరిణి నేడు చెట్లతో అల్లుకుపోయి అధ్వానంగా ఉంది. ప్రతి శనివారం వెలుగొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు. అయితే తలనీలాలు సమర్పించిన భక్తులతో పాటు ఆలయానికి వచ్చే వారు కోనేటిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకునే అవకాశం లేకుండాపోయింది. ఈ నెల 13 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పుష్కరిణి అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నువ్వు చల్లకుండ !




మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

కనిగిరిరూరల్: ఈ ఏడాది వేసవి తన ప్రతాపాన్ని గతేడాది కంటే ఎక్కువగా చూపిస్తుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి తాపం పెరిగింది.. దాహార్తి తీవ్రంగా ఉంది. పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుత కాలంలో చల్లని నీటి కోసం తహతహలాడే ప్రజలు ఫ్రిజ్, ఐస్ వాటర్ నీటిని తాగితే రోగాలు కొని తెచ్చుకున్నట్లేనని వైద్య నిపుణులు చెప్తున్నారు. సహజ సిద్ధమైన చల్లదనాన్ని ఇచ్చే. నీటిలోని హానికర బ్యాక్టీరియా, వైరస్‌లను లేకుండా శుభ్రపరిచే మట్టికుండ నీరే శ్రేయస్కరమని వైద్యులు వెల్లడిస్తున్నారు. దీంతో ఇంత కాలం మట్టి కుండల వైపు కన్నెత్తి చూడని వారు సైతం రక రకాల మట్టి కుండల కొనుగోలుకు పరుగులు పెడుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

సహజ సిద్ధంగా మట్టి కుండలోని నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలు. అందువల్ల ప్రజలు వాటి వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మండుతున్న ఎండల్లో తిరిగి అలసటతో ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలో నీరు తాగితే ఎంతో ఊరట లభిస్తోంది. ఎంతో ఖరీదైనా ఫ్రిజ్‌లున్నా ధనవంతులు సైతం నేడు మట్టి కుండలో నీటిని తాగేందుకు ఇష్టపడుతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ కొందరు గ్రామీణ ప్రాంతాల్లో మట్టి కుండల్లోనే వంటలు వండుకుంటున్నారు. ఫ్యాషన్ పేరితో మట్టి పాత్రల వినియోగం తగ్గించి రోగాల బారిన పడుతున్నారనేది నగ్న సత్యం. అల్యూమినియం, స్టీల్ పాత్రల్లో సిద్ధం చేసిన ఆహార పదార్థాలతో పాటు ఫ్రిజ్‌లలో నీటిని తాగే వారు అనారోగ్యాలకు గురవుతున్నారనడంలో సందేహం లేదు.

రేడియేషన్‌తో ఆరోగ్యానికి చేటు..

మారుతున్న కాలానుగుణంగా వాతావరణంలోను విపరీతమైన మార్పులు వచ్చాయి. సెల్ టవర్లు, ఏసీలు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఓవెన్‌లు, సెల్ ఫోన్లు తదితర రేడియేషన్ ఉత్పత్తి చేసే పరికరాల మధ్య యాంత్రిక జీవనానికి మనుషులు అలవాటు పడ్డారు. దీని వల్ల అనేక దుష్పరిణామాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం రేడియేషన్‌కు గురైతే దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడక తప్పదని తెలిపారు.

పెరిగిన మట్టి కుండల అమ్మకాలు..

గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రత తీవ్రత పెరగడంతో కుండల కొనుగోలు దారుల సంఖ్య పెరిగింది. కుండల అమ్మకపు దారులు తెనాలి, పలమనేరు తదితర ప్రాంతాల నుంచి కుండలు దిగుమతి చేసి.. వివిధ రకాల ఆకృతులు కల్గిన కుండలను స్థానిక కోర్టు సెంటర్ (కనిగిరి కందుకూరు రూట్‌లో) అమ్మకాలు చేస్తున్నారు. నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కనిగిరికి వివిధ గ్రామాల నుంచి వచ్చే గ్రామీణులు, పట్టణ ప్రజలు కుండల కొనుగోళ్లకు ఆసక్తి పెంచారు. దీంతో అమ్మకపు దారులు కుండల అమ్మకాల రేట్లు కూడా పెంచారు. గతేడాది రూ.300 ఉన్నా చిన్న కుండను ఇప్పుడు రూ.350, గతంలో రూ. 350 ఉన్న కుండను ప్రస్తుతం రూ.400 అమ్ముతున్నారు. కుండలో నీటిని తాగడం ద్వారా దప్పిక తీరడంతో పాటు, ఆల్కలైన్ లక్షణాలు నీటి పీహెచ్ స్థాయిని సమతుల్యం చేస్తాయని వైద్యులు చెప్పడటంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. దీంతో ప్రతి రోజు 20 నుంచి30 కుండలకు పైగా అమ్మకాలు జరుగుతున్నాయని, మూడు, నాలుగు నెలలు అమ్మకాలు జరుగుతాయని విక్రయదారులు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com